ముద్దుగుమ్మల సందర్శన లిస్ట్‌లో కేసీఆర్ ఫలాలు

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించే వాటిలో కేసీఆర్ నిర్మించిన కట్టడాలే అధికం

- జాబితాలో సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ రూం, టీ హబ్, బుద్ధవనం, యాదగిరిగుట్ట
- తెలంగాణ చరిత్రపై సచివాలయంలోనే అందాల భామలకు ప్రత్యేక కార్యక్రమం
- కేటీఆర్ అమలు చేసిన ట్యాంక్ బండ్ 'సండే ఫన్‌డే'లో
- సందడి చేయనున్న సుందరాంగులు

సచివాలయం వద్ద ఏర్పాట్లు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు తెలంగాణ అంటే ఏమిటో చూపించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేక కట్టడాలను లిస్ట్ చేసింది. అందులో కేసీఆర్ నిర్మించిన సచివాలయం, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, టీ హబ్, బుద్ధవనం, యాదగిరిగుట్ట లనే ప్రధానంగా ఎంపిక చేశారు. వీటిని హైదరాబాద్ అభివృద్ధికి సాక్ష్యంగా చూపించనున్నారు. అంతేకాదు యంగెస్ట్ స్టేట్ తెలంగాణ చరిత్రపై ప్రపంచ ముద్దుగుమ్మలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సైతం సచివాలయంలోనే ఏర్పాటు చేయడం విశేషం. ఆ పక్కనే ఉన్న అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం, గతంలో కేటీఆర్ వినూత్న తరహాలో అమలు చేసిన ట్యాంక్‌బండ్ సండే ఫన్‌డేలో సైతం ఈ ముద్దుగుమ్మలు పాల్గొనేలా తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది. మొత్తంగా కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రపంచానికి చూపించి.. హైదరాబాద్ అదరహో అనేలా కాంగ్రెస్ సర్కార్ ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకోవడానికి తహతహలాడుతున్నది.

నగరంలో ముద్దుగుమ్మల పర్యటన ఇలా

సుమారు 120 దేశాల నుంచి వస్తున్న ముద్దుగుమ్మలను నగరంలోని పలు ప్రతిష్ఠాత్మక కట్టడాలను పరిచయం చేయనున్నారు. 12న నాగార్జున సాగర్‌లో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టు, బుద్ధిస్ట్ థీమ్ పార్కును మిస్ కంటెస్టెంట్స్‌లు సందర్శించనున్నారు. అదే రోజు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ ఏర్పాటు చేశారు. 13న చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించి లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో పాల్గొంటారు. మే 15న యాదగిరిగుట్టను సందర్శిస్తారు. 16న ఏఐజీలో మెడికల్ టూరిజం ఈవెంట్‌కు హాజరవుతారు. 17న రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శిస్తారు. 18న తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, తెలంగాణ సచివాలయాన్ని సందర్శించనున్నారు. ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే సండే ఫన్‌డే కార్నివాల్‌లో పాల్గొంటారు. సచివాలయంలో అధికారులు మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌కు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను వివరిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. అదే రోజు టీ హబ్‌ను సందర్శించనున్నారు. మే 10 నుంచి ప్రారంభం కానుండగా 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగుతుంది.

జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్లకు స్థాన చలనం

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పలువురు అడిషనల్ కమిషనర్లకు స్థానం చలనం కల్పిస్తూ శుక్రవారం జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. మెటర్నటీ లీవ్‌ను పూర్తి చేసుకుని తిరిగి జీహెచ్ ఎంసీలో జాయినింగ్ లెటర్ ఇచ్చిన ఐఏఎస్ స్నేహ శబరీష్‌కి ప్రకటనల విభాగం అదనపు కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు మరో అడిషనల్ కమిషనర్ (యూబీడీ) వీవీఎల్ సుభద్ర దేవి (ఐఎఫ్ఎస్) లీవ్‌పై వెళ్లగా..ఈ బాధ్యతలు సైతం అదనంగా స్నేహ శబరీష్‌కు అప్పగించారు. ప్రకటనల విభాగానికి అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన వేణుగోపాల్ రెడ్డికి ట్రాఫిక్ అండ్ స్ట్రీట్ లైటింగ్ బాధ్యతలు అప్పగించారు.

ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడి..

బొల్లారం, మే 10: ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తిరుపతి రాజు వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓంరాజ్ సైనీ (20) బతుకు దెరువుకోసం బోయినపల్లికి వచ్చి చిన్న తోకట్ట వద్ద స్నేహితులతో కలిసి ఓ రూమ్ లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇదే ప్రాంతంలో ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు చేందిన బాలిక (16)తో అతనికి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి.. తన గదికి పలుమార్లు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల అతను తప్పించుకు తిరుగుతుండడంతో మోసపోయానని గ్రహించిన బాలిక.. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సరిగ్గా 12:12 గంటలకు..జీరో షాడో కనువిందు

సిటీబ్యూరో, మే 9, (నమస్తే తెలంగాణ): మిట్ట మధ్యాహ్నం.. నగర ప్రజలు ఓ అద్భుతమైన ఖగోళ దృశ్యానికి ప్రత్యక్ష సాక్షులయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 12.12 గంటలకు నగరంలో 'జీరో షాడో డే' నమోదైంది. ఈ సమయంలో నిటారుగా ఉన్న వస్తువులకు ఎలాంటి నీడ కనిపించకపోవడం విశేషం. ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక కార్యదర్శి ఎన్. శ్రీ రఘునందన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..' సూర్యుడు మన తలపైకి వచ్చినప్పుడు సూర్య కిరణాలు నేరుగా భూమిని తాకుతాయి. దీంతో నిటారుగా ఉన్న వస్తువుల నీడలు పడవు. భూమి 23.5 డిగ్రీల వాలుతో ఉండటంతో.. సూర్యుడు సంవత్సరాంతర కాలంలో వివిధ మార్గాల్లో తిరుగుతుంటాడు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ఈ జీరో షాడో డే రెండు సార్లు వస్తుంది' అని పేర్కొన్నారు. తిరిగి ఈ ఏడాది ఆగస్టులో తెలంగాణ, ఏపీలో మరోసారి జీరో షాడో డే ఉంటుందని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా పేర్కొంది.

వంటావార్పుతో నిరసన

మాదాపూర్, మే 9: హఫీజ్‌పేటలోని జనప్రియ నగర్ ఫేస్- 5లో స్థానిక ప్లాట్ యాజమానులు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంతో పాటు చందానగర్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రెండు రోజులుగా నిరసన దీక్ష చేపట్టారు. నిరసన దీక్ష లో భాగంగా శుక్రవారం వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు.

అందుబాటులోకి మై జీహెచ్ఎంసీ యాప్

సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కర్ణన్ సూచన

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌వాసుల అవసరాలు తీర్చేందుకు సరికొత్త మార్పులతో మై జీహెచ్ఎంసీ యాప్ అందుబాటులోకి వచ్చింది. శానిటేషన్, ఇంజినీరింగ్, హెల్త్, స్ట్రీట్ లైట్, రోడ్స్, డ్రెయిన్ క్లీనింగ్, రోడ్ స్వీపింగ్, తదితర సమస్యలపై ఫొటోగ్రాఫ్‌లతో పాటు జియో లొకేషన్ ద్వారా ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారికి చేరుతుంది. అంతేకాక ఈ సమస్య పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకోవడంతో పాటు ఫీడ్‌బ్యాక్ సబ్మిట్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ టాక్స్, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు వెహికిల్ బుకింగ్ లాంటి సర్వీస్‌లను సింగిల్ క్లిక్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డు, యూపీఐ ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం సైతం ఉంది. వీటితో పాటుగా జీహెచ్ఎంసీ కార్యాలయాల లొకేషన్, వాతావరణ సూచనలు.. ఇలా అనేక సేవలు క్షణాల్లో పొందవచ్చని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కోరారు. మై జీహెచ్ఎంసీ యాప్‌ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్‌లోని ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని సమస్యలు, సేవలు పొందవచ్చునని కమిషనర్ సూచించారు. లొకేట్ వార్డు ఆఫీస్ ఆప్షన్‌లోకి వెళ్తే జీహెచ్ఎంసీ ఆఫీసుల లొకేషన్ తెలుసుకోవచ్చన్నారు. ట్రేడ్, పెట్ డాగ్ లైసెన్స్‌ను ఫ్యూ క్లిక్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. నగర పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి

అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): సమ్మర్ కోచింగ్ క్యాంపుల ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు సంబంధిత కోచ్‌లను ఆదేశించారు. శుక్రవారం సికింద్రాబాద్ జోన్‌లోని వివిధ ప్లే గ్రౌండ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్‌ను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. జీహెచ్ ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులకు మంచి స్పందన లభిస్తుందని, గ్రేటర్ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆరు నుంచి 16 సంవత్సరాల పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఆరు జోన్లలో వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన 77 మంది పార్ట్ టైం కోచ్‌లు, 800 మంది గౌరవ వేతన కోచ్‌ల ద్వారా సమ్మర్ కోచింగ్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. 44 విశాలమైన బహుళ క్రీడా సముదాయాలు, 29 స్విమ్మింగ్ పూల్స్, 13 ఆట స్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో 44 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి హర్షణీయం

- రాష్ట్ర హోం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా
- చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం

చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసిన ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హోం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, ఐపీఎస్ రవిగుప్తా, చిత్రంలో జైళ్ల శాఖ డీజీ, ఐపీఎస్ సౌమ్యమిశ్రా, తదితరులు

చర్లపల్లి, మే 9: ఖైదీల్లో శారీరక సామర్థ్యంతో పాటు మానసికోల్లాసాన్ని నింపేందుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలంగాణ రాష్ట్ర హోం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, ఐపీఎస్ రవిగుప్తా పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు -2025ను ఆయన జైళ్ల శాఖ డీజీ, ఐపీఎస్ డాక్టర్ సౌమ్యమిశ్రా, జైలు ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి హర్షణీయమని, ముఖ్యంగా నాలుగు ప్లాట్‌ఫాంలుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌లో 55మందిని కేటాయించి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జైళ్ల శాఖ డీజీ, ఐపీఎస్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జైలులో ఖైదీలకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వారు ఖైదీలకు అందజేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర కారాగారంలోని వివిధ పరిశ్రమల్లో ఖైదీలు తయారు చేస్తున్న వస్తువులు, పండిస్తున్న పంటలు, భోజనశాల, వైద్యశాలతో పాటు వివిధ బ్యారక్‌లను సందర్శించి.. జైలు అధికారులు, సిబ్బంది పనితీరును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు రాజేశ్, మురళీబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, వ్యవసాయక్షేత్రం సూపరింటెండెంట్ కళాసాగర్‌లతో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డెన్లు, ఖైదీలు, వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో వెంకటాపురం డివిజన్ కమలాలయ ఎంక్లేవ్‌కు వరద ముప్పు నివారణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన నాయకులు - మల్కాజిగిరి, మే 9

తూకుంటలో అధికారులు నిర్వహించిన గ్రామ సభలో తక్కువ స్థాయిలో హాజరైన ఆస్తులు కోల్పోతున్న వారు

బహిరంగ మార్కెట్ ధరే చెల్లించాలి

మేడ్చల్, మే9(నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణపై నిర్వహించిన గ్రామ సభలో ఆస్తులు కోల్పోతున్న వారు బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలను తమ ఆస్తులకు చెల్లించాలని అధికారులకు విన్నవించారు. పార్యడైజ్ నుంచి శామీర్‌పేట రింగ్‌రోడ్డు వరకు నిర్మించిననున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అవసరమయ్యే తూకుంట, హకింపేట, పోతాయిపల్లిలోని వారు ఆస్తులు కోల్పోనున్న వారితో తూకుంటలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. రోడ్డు విస్తరణలో 218 మందికి చెందిన ఆస్తులు కోల్పోతున్న నేపథ్యంలో జరిగిన గ్రామ సభలో అధికారుల ముందు అనేక డిమాండ్లను ముందుంచారు. తమ ఆస్తులు కోల్పోకుండా వంద ఫీట్ల వరకే విస్తరణ చేయాలని, అవసరమైతే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలను అందించాలని అధికారులకు వివరించారు. కాగా, మూడు గ్రామాలకు సంబంధించి 218 మందికి గ్రామ సభకు అధికారులు ఆహ్వానిస్తే వచ్చింది 37 మంది మాత్రమే వచ్చారు. ఈ గ్రామ సభలో డీఆర్వో హరిప్రియ, ఆర్డీవో శ్వాంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పసిడి పేరుతో నయా దందా..!

- ధర పెరగడంతో రంగంలోకి ముఠాలు..
- తక్కువ ధరకు బంగారమంటూ మోసాలు..
- దృష్టి మరల్చి చోరీలు, నకిలీలతో బురిడీలు..
- ఆన్‌లైన్‌లోనూ తక్కువరేటంటూ దగా..

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): పుత్తడి ధర రికార్డు స్థాయికి చేరింది... రాబోయే రోజుల్లో పెరుగుతుందా.. తగ్గుతుందా.. అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఉన్న ఈ ఆలోచనను సొమ్ము చేసుకునేందుకు మాయగాళ్లు రంగంలోకి దిగారు. తక్కువ ధరకే పసిడి అంటూ నమ్మించి అందినంత కొట్టేసి ముఖం చాటేస్తున్నారు. నగరంలో అంతర్రాష్ట్రమాయగాళ్ల ముఠా నకిలీ బంగారం అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇటీవల తమ బంధువులు దుబాయ్ నుంచి వస్తున్నారు..వచ్చేటప్పుడు బంగారు బిస్కెట్లు తెస్తారంటూ ఆశచూపిస్తూ.. అడ్వాన్స్‌గా చాలా మంది వద్ద రూ.8.5లక్షలు తీసుకుని.. ముఖం చాటేయడంతో పంచాయతీ పెద్దమనుషుల వద్దకు చేరింది. అక్కడ కొంత డబ్బులిచ్చి ఎంచక్కా మోసగాడు తప్పించుకున్నాడని సమాచారం. అయితే.. పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి దగ్గరలో ఉన్న ఓ ప్రాంతంలో జరిగిన ఈ మోసంలో బాధితులు సుమారుగా కోటిరూపాయల వరకు మోసపోయినట్లు తెలిసింది. ఈ విషయం పోలీసుల దాకా రానీయకుండా జాగ్రత్త పడినప్పటికీ.. ఆ నోటా ఈనోటా పోలీసులకు చేరింది. అయితే.. ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇదొక్కటే కాదు.. కొన్ని నెలల క్రితం సీసీఎస్ పోలీసులకు వచ్చిన ఫిర్యాదు ప్రకారం పలువురు మహిళల నుంచి ఒక ముఠా నగదు వసూలు చేసింది. రూ.50వేలు కట్టి చేరితే పది శాతం తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెప్పి చాలామంది దగ్గర డబ్బులు వసూలు చేసింది. అలా వసూలు చేసిన సుమారు నాలుగుకోట్ల రూపాయలతో మోసగాళ్లు పరారయ్యారు. ఇలా గొలుసు కట్టు పద్ధతిలో ఐదుకు ఆరు, ఏడు అంటూ బంగారు నాణేల పేరుతో కూడా మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

బంగారం కొట్టేసే ముఠాలు..!

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కొన్ని ముఠాలు నగరంలోని వ్యాపారులు, గృహిణులను తేలికగా బురిడీ కొట్టిస్తున్నాయి. పాతబంగారం దొరికిందంటూ బంగారు కడ్డీలు చూపుతూ.. కడ్డీలో ఓవైపు అసలు బంగారం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. బంగారం నాణ్యత చెక్‌చేసే సందర్భంలో బంగారం ఉన్నట్టు చూపించి తక్కువ ధరకు బంగారం ఇస్తున్నామని నమ్మబలుకుతారు. దీంతో బయట లక్షరూపాయలు ఉన్న బంగారం ఇక్కడైతే రూ.80వేలకే వస్తుండడంతో జనాలు నమ్మి వాటిని కొనుగోలు చేసి మోసపోతున్నారు. కొన్నిచోట్ల పురాతన నాణేలు అంటగట్టి మాయమవుతున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే ఎదుటివారి దృష్టి మరల్చి చోరీలు, మోసాలకు పాల్పడుతున్న ముఠాలు కూడా నగరంలో సంచరిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. వీరు ఎక్కువగా ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, చిక్కడపల్లి , హిమాయత్‌నగర్, తదితర ప్రాంతాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల నిఘాలో తెలిసినట్లు సమాచారం. అయితే మోసపోయిన కొందరు తమకు జరిగిన మోసాలు బయటపెట్టలేక చాలావరకు వెనక్కు తగ్గుతున్నారని పోలీసులు చెప్పారు.

ఆన్‌లైన్‌లో తక్కువ రేట్‌కంటూ దగా..

వాట్సప్ ద్వారా కాల్స్‌చేసి తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామంటూ వలవేసి అందినకాడికి దండుకుంటున్న నేరగాడిని సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. మోసగాడు.. నగరంలో ఉన్న అనేకమంది ఫోన్ నంబర్లు సేకరించి వారికి వాట్సప్‌కాల్ చేసి తాను బంగారం వ్యాపారినంటూ పరిచయం చేసుకున్నాడు. ముంబైలో తక్కువ ధరకు బంగారం ఖరీదు చేస్తుంటానని, దాన్ని మార్కెట్ రేటు కంటే తక్కువగా విక్రయిస్తానని చెప్పాడు. వారిని నమ్మించడం కోసం తెలిసిన వారి కొందరిపేర్లు చెప్పేవాడు. ఈ క్రమంలో నగరవాసి నుంచి రూ.5లక్షలు స్వాహా చేశాడు. ఇలా ఆన్‌లైన్‌లో దుబాయ్, ముంబై పేర్లు చెప్పి తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామంటూ మొదట్లో కొంత బంగారం అంతే తక్కువ ధరకు ఇచ్చి ఆ తర్వాత పెద్ద మొత్తంలో వసూలుచేసి ఆపై స్పందించని మోసగాళ్ల వ్యవహారం కూడా బయటపడింది. ఈ విషయంలో పోలీసులు కూడా తమకు వెంటనే చెప్పి, సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తే తప్ప తాము స్పందించలేని పరిస్థితి ఉంటుందని, అయినప్పటికీ కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రసీదు లేకుండా బంగారు కొనుగోళ్లు, నాణ్యత పరీక్షించకుండా తెలియనివారి వద్ద నుంచి కొనుగోలు చేసి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని, ఈ విషయంలో ప్రజలే అప్రమత్తంగా ఉండి నేరాలను అదుపు చేయడంలో తమకు సహకరించాలని పోలీసులు చెప్పారు.

ఇంటర్నేషనల్ సౌత్ ఏసియన్ గేమ్స్‌లో హైదరాబాద్ వాసి సత్తా

బంగారు పతకాలతో రమణయ్య

ముషీరాబాద్, మే 9: ఇంటర్నేషనల్ సౌత్ ఏసియన్ గేమ్స్‌లో హైదరాబాద్ వాసి సత్తా చాటాడు. ఇండో- నేపాల్ రంగశాల స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ లాంటి పలు దేశాలు పాల్గొనగా.. భారత్ నుంచి అరబిందో జూనియర్ కళాశాల ఉద్యోగి ఆర్.రమణయ్య (45 సంవత్సరాల విభాగంలో) పోటీలోకి దిగాడు. లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రోలో మూడు బంగారు పతకాలు సాధించి తన సత్తాచాటారు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన రమణయ్య.. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో కార్మికుల మరణం బాధాకరం..

ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): జవహర్‌నగర్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై శుక్రవారం శానిటేషన్ అధికారులు, రాంకీ యాజమాన్యంతో మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాంకీ యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్‌కు వివరించడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపి.. పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్ట్ నిబంధనల మేరకు ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం శుక్రవారం అందజేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, రాంకీ ప్రాజెక్టు డైరెక్టర్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.